నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
EVENING EDITION
పేజీలు: 02
PM





# బిగ్ బాస్ 7 టైటిల్ విన్నర్‌గా పల్లవి ప్రశాంత్



105 రోజుల పాటు ప్రేక్షకులను అలరించిన బిగ్ బాస్ 7 ఈరోజు గ్రాండ్ గా ముగిసింది. ఈ సీజన్ ఆడియెన్స్ ను విశేషం గా ఆకట్టుకుంది. ఈ రోజు గ్రాండ్ ఫినాలే జరిగింది, ఈ సీజన్ విజేత ఎవరనే ఉత్కంఠకు తెరపడింది. రైతు బిడ్డ గా పేరుగాంచిన పల్లవి ప్రశాంత్ ఈ సీజన్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. ఉద్విగ్న క్షణాల మధ్య పల్లవి ప్రశాంత్‌ను చాంప్‌గా ప్రకటించారు హోస్ట్ నాగార్జున. వ్యవసాయ నేపథ్యం నుండి వచ్చిన పల్లవి ప్రశాంత్ యూట్యూబర్ గా బాగా పాపులర్ అయ్యాడు. ఇక బిగ్ బాస్ హౌస్ లోకి అడుగుపెట్టి ఎన్నో ఎత్తు పల్లాలు చూసాడు. అతని కష్టానికి ఇప్పుడు ఫలితం దక్కింది. ప్రేక్షకులు మొదటి నుండి అతని ఆటను ఇష్టపడటం ప్రారంభించారు. తద్వారా అతను ఇతరులతో పోల్చినప్పుడు ఎక్కువ ఓట్లు పొందాడు. మరో పోటీదారు అమర్‌దీప్ ఈ సీజన్‌లో రన్నరప్‌గా నిలిచాడు. శివాజీ సెకండ్ రన్నరప్‌గా నిలిచాడు.



## తమిళనాడులో భారీ వర్షాలు..
## నేడు స్కూళ్లు, కాలేజీలకు సెలవు

తమిళనాడు రాష్ట్రాన్ని వానలు వదలడం లేదు. నిన్న మొన్నటి వరకు ఆ రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన వర్షాలు ప్రస్తుతం మరోమారు ముంచెత్తుతున్నాయి. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో వచ్చే 2, 3 రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు అంచనా వేసింది. చెన్నై వాతావరణ కేంద్రం అంచనాల ప్రకారం.. తిరునల్వేలి, రామనంతపురం, పుడుకొట్టై, తూత్తుకుడి, శివగంగా జిల్లాల్లో నేటి నుంచి భారీ నుంచి అతి భారీ వర్షాలు పడనున్నాయని తెల్పింది. ఇక కన్యాకుమారి, తంజావూరు, తిరువరూర్, నాగపట్నం, మధురై, మైలాడుతురై, తెన్కాసి, విరుదునగర్ జిల్లాల్లో ఆదివారం వర్షాలు కురవడంతో పలు ప్రాంతాల్లో భారీగా నీరు చేరింది. రోడ్లపై నీరు నిలిచి రవాణాకు ఆటంకాలు ఏర్పడ్డాయి. దక్షిణ తమిళనాడులోని జిల్లాలతో పాటు దక్షిణ కేరళ, లక్షద్వీప్‌లోనూ భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఆదివారం తమిళనాడులోని దక్షిణ జిల్లాల్లో భారీ వర్షపాతం పడింది. పాళయంకోట్టైలో 26 సెంటీమీటర్లు, కన్యాకుమారిలో 17 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. తిరునల్వేలి జిల్లాలో వరద బాధిత ప్రజలను షెల్టర్ క్యాంపుకు తరలించారు. షెల్టర్ హోమ్‌లోని ప్రజలు రేషన్ కోసం బారులు తీరారు. తూత్కుడి జిల్లా, తాలూకా శ్రీవైకుంటంలో ఆదివారం 525 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆ ప్రాంతంలో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.




## కండక్టర్ లేకుండా 10 కిలోమీటర్ల ప్రయాణం

బాన్సువాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కండక్టర్ లేకుండా 10 కిలోమీటర్లు ప్రయాణించింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన ప్రకారం బాన్సువాడ బస్టాండ్ నుంచి నిజామాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సు ప్యాసింజర్లతో నిండి ఉంది. కండక్టర్, డ్రైవర్ కు కంట్రోలర్ వద్దకు వెళ్తానని సైగ చేసి చెప్పాడు. కండక్టర్ బస్సు ఎక్కాడని భావించిన డ్రైవర్, బస్సును ముందుకు పోనిచ్చాడు. అలా పది కిలోమీటర్ల దూరంలో ఉన్న నెమ్లి వరకు బస్సు తోలాడు. కండక్టర్ లేడని ప్యాసింజర్లు చెప్పడంతో అక్కడే బస్సును ఆపాడు. కండక్టర్ వచ్చే వరకు ఆలస్యమవుతుందని భావించి, ప్యాసింజర్లను వేరే బస్సులో ఎక్కించి నిజామాబాద్ కు తరలించాడు. ఈ ఘటనపై పూర్తి విచారణ చేస్తామని డీఎం తెలిపారు.



## తార్నాకలో మహిళపై సామూహిక లైంగికదాడి..

హైదరాబాద్‌లోని తార్నాకలో దారుణం చోటుచేసుకున్నది. బస్సు కోసం వేచిచూస్తున్న మహిళను గమ్యస్థానంలో దింపుతానని చెప్పి.. తన స్నేహితులతో కలిసి ఆమెపై సామూహిక లైంగికదాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రశాంత్ నగర్‌కు చెందిన బర్నే ఏసు మెకానిగ్‌కు పనిచేస్తున్నాడు. ఈ నెల 7న అర్ధరాత్రి తన పని ముగించుకుని బైక్‌పై తార్నాక నుంచి ప్రశాంత్‌నగర్‌కు వెళ్తున్నాడు. ఈ తార్నాక బస్ స్టాప్‌లో బస్ కోసం వేచి ఉన్న మహిళను చూసిన అతడు.. బైక్ ఆపి ఆమెతో మాటలు కలిపాడు. ఆమెను లాలాపేటలో దింపుతానని చెప్పి తన వాహనంపై ఎక్కించుకున్నాడు. అయితే ఆమెను మాటల్లోపెట్టి ప్రశాంత్‌నగర్‌లోని రైల్వే క్వార్టర్స్ సమీపంలో ఉన్న నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లాడు. ఆమెపై సామూహిక అత్యచారం చేశారు. తర్వాత బాధితురాలిని తార్నాకలో వదిలి వెళ్లిపోయారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదుచేశారు.




# యువగళం ముగింపు సభలో
# టీడీపీ- జనసేన కీలక ప్రకటన
## అక్కడి నుంచే ఎన్నికల శంఖారావం

టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర ముగింపు దశకు చేరుకుంది. ఈరోజు విశాఖ జిల్లాలోని అగనంపూడి వద్ద పాదయాత్ర ముగినుంది. దీంతో యువగళం ముగింపు సభను అత్యంత భారీగా నిర్వహించనుంది టీడీపీ. విజయనగరం జిల్లాలోని భోగాపురం మండలం పోలిపల్లిలో యువగళం ముగింపు సభ జరుగనుంది. ఈ సభకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ హాజరుకానున్నారు. అంతేకాదు టీడీపీ-జనసేన ఈ సభ నుంచే కీలక ప్రకటన చేసే అవకాశాలున్నాయని సమాచారం. అలాగే ఇదే సభనుంచి ఇరు పార్టీలు ఎన్నికల శంఖారావాన్ని పూరించనున్నట్లుగా తెలుస్తోంది.కాగా.. ఏపీలో ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో అన్ని పార్టీలు ఎన్నికల సమరానికి సమాయత్తమవుతున్నాయి. దీంట్లో భాగంగా ఇప్పటికే పొత్తులో ఉన్న టీడీపీ-జనసేన పార్టీలు కూడా ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి. ఉమ్మడి మ్యానిఫోస్టో కోసం కసరత్తులు చేస్తున్నాయి. దీని కోసమే చంద్రబాబు, పవన్ భేటీ అయ్యారు. కీలక అంశాలపై చర్చించారు. ఎన్నికల వ్యూహం, ఏపీ సుపరిపాలన,వైసీపీ విముక్త ఆంధ్ర ప్రదేశ్ కోసం ఎలా కలిసి పని చేయాలి..? అనే



అంశాలపై చంద్రబాబు, పవన్ కల్యాణ్ చర్చించారు. వ్యూహాలు, రాజకీయ అంశాలు, పార్టీ పరంగా సంస్థాగతంగా చేయాల్సిన కార్యక్రమాలపై చర్చలు జరిపారు. భవిష్యత్తులో ఇరు పార్టీల నాయకులు కలిసికట్టుగా విజయం సాధించి.. మంచి ప్రభుత్వం, పరిపాలన అందించాలని నిర్ణయించారు. ఏపీలో ఎన్నికలకు దగ్గర పడుతుండటంతో ఇరు పార్టీలు వ్యూహాల్లో వేగం పెంచారు. ఇరు పార్టీల మధ్య పొత్తు బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, రాజకీయ పరిణామాలపై ఇరువురు నేతలు చర్చించారు. త్వరలో రాయలసీమలో బహిరంగ సభకు ప్లాన్ చేస్తున్నాయి రెండు పార్టీలు. ఉమ్మడి మ్యానిఫెస్టోను ప్రకటించేందుకు కార్యాచరణను సిద్ధం చేసే అంశంపై చర్చించారు. నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర చిత్తూరు జిల్లా కుప్పంలో 2023,జనవరి 27న ప్రారంభమైంది. మొత్తం 97 నియోజకవర్గాల్లో 226రోజులు 3,132 కిలో మీటర్ల మేర లోకేష్ పాదయాత్ర సాగింది. ప్రతి జిల్లాలోనూ లోకేశ్ యువగళం పాదయాత్రకు టీడీపీ శ్రేణులు, ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఇవాళ విశాఖ జిల్లాలోని అగనంపూడి వద్ద యువగళం యాత్ర ముగియనుంది.



## తిరుమలలో భక్తుల రద్దీ..

తిరుమలలో భక్తుల రద్దీ భారీగా ఉండటంతో.. గత రెండు రోజుల నుంచి భక్తులు భారీగా తిరుమల కొండకు వెళ్తున్నారు. డిసెంబర్‌లో సెలవులు రావడంతో గత రెండు వారాలుగా శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. దీంతో తిరుమల కొండకు భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. ఈ ఏడాది చివరి నెల చివరి రెండు వారాల పాటు భక్తులు అధిక సంఖ్యలో వచ్చి శివుడిని దర్శించుకోవడంతో రద్దీ తక్కువగా ఉంటుందని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. రూ.300 ప్రత్యేక దర్శనం టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులు శ్రీనివాసుని దర్శనానికి మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతోంది. నిన్న తిరుమల శ్రీవారిని 74 వేల 845 మంది భక్తులు దర్శనం చేసుకున్నారు. వీరిలో 26 వేల 122 మంది భక్తులు తలనీలాలను సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. కాగా, నిన్న తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం 4.44 కోట్ల రూపాయలు వచ్చిందని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని 20 కంపార్ట్‌మెంట్లలో భక్తులు శ్రీవారి దర్శనం కోసం బారులు తీరారు.

## ప్రచారంలో వివేక్ రామస్వామి దూకుడు



అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరపున అభ్యర్థిత్వం కోసం పోటీ పడుతున్న ప్రముఖ భారతీయ అమెరికన్ వివేక్ రామస్వామి ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఆయన గత వారం ఏకంగా 42 ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వచ్చే వారం కూడా 38 ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో దిగేందుకు ప్రయత్నిస్తున్న ఇతర అభ్యర్థుల కంటే ప్రచారపర్వంలో ఆయన చాలా ముందున్నారు. ప్రచారంలో అంత ఉత్సాహంగా ఎలా పాల్గొంటున్నారంటూ విలేకరులు అడిగిన ప్రశ్నకు రామస్వామి స్పందిస్తూ.. "నా ప్రచార కార్యక్రమాలకు హాజరవుతున్న ప్రజలను చూస్తుంటే.. ఎంతో శక్తి లభిస్తోంది. దేశం పట్ల వారికి ఉన్న శ్రద్ధే నన్ను ప్రోత్సహిస్తోంది. సామాజిక మాధ్యమాలు, టెలివిజన్ ప్రసారాలతో కూడా ఈ స్థాయి ప్రచారం అసాధ్యం.



## శబరిమలలో చిన్నారులకు ప్రత్యేక గేటు

శబరిమల అయ్యప్పస్వామి దర్శనానికి వచ్చే చిన్నారులు సులభంగా మణికంఠుడి సన్నిధికి చేరుకునేందుకు వీలుగా ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీబీడీ) ప్రత్యేక గేటు వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. "ఆదివారం ఉదయం నుంచి చిన్నారులకు ముందు వరుసలో అయ్యప్ప దర్శనం కల్పిస్తున్నాం. దీంతో వారికి పొడవైన క్యూలైన్ల బాధ తప్పింది. ఈ చర్య చిన్నారుల తల్లిదండ్రులకు, ప్రత్యేకంగా కేరళ వెలుపలి నుంచి వచ్చిన భక్తులకు ఎంతో ఉపయుక్తం" అని టీబీడీ ఓ ప్రకటనలో పేర్కొంది.

## బాలిస్టిక్ క్షిపణి ప్రయోగించిన ఉత్తర కొరియా

ఉత్తర కొరియా బాలిస్టిక్ క్షిపణి ప్రయోగాలను ఐరాస భద్రతా మండలి నిషేధించగా తాజాగా మరోసారి బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించింది. ఈ క్షిపణిని తమ తూర్పు జలాల వైపు ప్రయోగించినట్లుగా గుర్తించామని దక్షిణ కొరియా ఆర్మీ తెలిపింది. అది ఏ క్షిపణి, ఎంత దూరం ప్రయాణించింది అన్నది ద. కొరియా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ తెలపలేదు.





## డిసెంబర్ 20న.. భూదాన్ పోచంపల్లికి రానున్న రాష్ట్రపతి ద్రౌపతిముర్ము

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 20న యాదాద్రి జిల్లాలో పర్యటించనున్నారు. శీతాకాల విడిదిలో భాగంగా ఈనెల 18న హైదరాబాద్ కు రాష్ట్రపతి వస్తున్నారు. ఇందులో భాగంగా ప్రపంచ ప్రఖ్యాతి పొందిన ఇక్కత్ చీరలు, దేశంలో భూదానోద్యమానికి మూలమై, రెండేండ్ల క్రితం బెస్ట్ టూరిజం విలేజ్‌గా ఎంపికైన భూదాన్ పోచంపల్లిని సందర్శించబోతున్నారు. పోచంపల్లికి వస్తున్న రాష్ట్రపతి ముర్ము గంటపాటు ఇక్కడే ఉండి చేనేత కళాకారులతో సమావేశం అవుతారు. వారి ప్రతిభతో పాటు ఆర్థిక స్థితిగతులు తెలుసుకొని వారితో ముచ్చటిస్తారు. పద్మశ్రీ, సంత్ కబీర్ వంటి జాతీయ అవార్డుల గ్రహీతలతో ఆమె ప్రత్యేకంగా మాట్లాడుతారు. ఇందుకోసం అధికారులు ఉమ్మడి నల్గొండలో అవార్డులు వచ్చిన 16 మందిని గుర్తించి వారి జాబితాను ఢిల్లీకి పంపించారు.



## చికెన్ ధరలకు రెక్కలు..

హాలిడే వచ్చిందంటే సరదాగా గడిపే నగరవాసుల భోజనంలో చికెన్, మటన్ ముక్కలు ఉండాల్సిందే! అయితే కార్తిక మాసంలో సహజంగానే కోళ్లు, చికెన్ ధరలు తగ్గాయి. ఇప్పుడు కార్తికం ముగియడంతో ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. గురువారం నుంచి ధరలు పెరుగుతున్నాయి. కార్తిక మాసంలో కిలో చికెన్ ధర గరిష్ఠంగా రూ.180 ఉండేది. ఆదివారం ఒక్కసారిగా రూ.220-240కి చేరింది. మొబైల్ యాప్‌లలోనైతే రూ.250-280కి విక్రయిస్తుండటం నివ్వెరపరుస్తున్నది.

### ఒక్కసారిగా పెరిగిన ధర

రిటైల్ మార్కెట్‌లో ధరలు కూడా అధికమయ్యాయి. వారం క్రితం కిలో చికెన్ ధర రూ.150-180గా ఉండేది. ఇలా ఒక్కో కిలోపై రూ.80-90 పెరిగి, ఆదివారం కిలో రేట్ రూ.220-240కి చేరింది. బాయిలర్ చికెన్‌తోపాటు దేశీకోడి కూడా ఒక్కో కిలో మాంసాన్ని రూ.100-150 ఎక్కువకు విక్రయించారు.



## సెల్‌ఫోన్ మాయలో ప్రమాదాలు..
### కారణమవుతున్న యువత

నేటి ఆధునిక జీవితంలో మనుషులకు సెల్‌ఫోన్‌తో వీడదీయరాని బంధం ఏర్పడింది. ప్రతి సెకను అంటి పెట్టుకొని ఉండాలన్న ఆసక్తి ఎక్కువ మందిలో కనిపిస్తున్నది. అయితే.. ఏ పరిస్థితుల్లో ఉన్నా కాల్ లిఫ్ట్ చేయాలనే ఆతృత అనేక అనర్థాలకు దారి తీస్తున్నది. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరం, నేరమని తెలిసినా కొందరు మానడం లేదు. సెల్ ఫోన్ వాడుతూ ముందూ వెనుకా గమనించకుండా ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతున్నారు. ట్రాఫిక్ రద్దీలోనూ సెల్‌ఫోన్ మాట్లాడుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. వారే కాకుండా ఎదుటి వారిని ప్రమాదంలోకి నెట్టి తీవ్ర నష్టాన్ని మిగుల్చుతున్నారు. సెల్‌ఫోన్ అధిక వినియోగం యువత పాలిట శాపంగా మారుతున్నది.



## భారీగా పెరిగిన నిత్యావసర ధరలు

ఏడాది క్రితంతో పోలిస్తే నిత్యావసర ధరలు భారీగా పెరిగినట్లు పౌరసరఫరలశాఖ విశ్లేషణలో తేలింది. కందిపప్పు ధర 50%, బియ్యం ధర 13-25% పెరిగాయి. గతేడాది డిసెంబర్ లో కిలో కందిపప్పు 105. 82 ఉండగా, ఈ ఏడాది డిసెంబర్ లో 158. 33 పెరిగింది. కిలో ఉల్లి 27. 19 నుంచి 46. 97 చేరింది. మిర్చీ, ఆయిల్ ధరలు మాత్రం తగ్గాయి.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## వివేకా హత్య కేసులో కొత్త మలుపు

మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో కొత్త మలుపు చోటుచేసుకుంది. వివేకా కుమార్తె సునీత, ఆమె భర్త రాజశేఖరరెడ్డి, కేసు దర్యాప్తు చేపట్టిన సీబీఐ ఎస్పీ రాంసింగ్‌పై పులివెందుల పోలీసులు కేసు నమోదుచేశారు. వివేకా హత్యకేసులో కొందరు తనను బెదిరిస్తున్నారని ఆయన పీఏ కృష్ణారెడ్డి గతంలో పులివెందుల కోర్టును ఆశ్రయించారు. కొందరు నేతల పేర్లు చెప్పాలని సీబీఐ అధికారులు ఒత్తిడి చేస్తున్నట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. హత్య కేసులో పులివెందులకు చెందిన కొందరు నాయకుల ప్రమేయం ఉందనేలా సాక్ష్యం చెప్పాలని.. ప్రత్యేకించి ఎస్పీ రాంసింగ్ ఒత్తిడి తెస్తున్నారని అప్పట్లో పిటిషన్‌లో వివరించారు. సీబీఐ అధికారులకు అనుకూలంగా సాక్ష్యం చెప్పాలని వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖరరెడ్డి కూడా తనపై ఒత్తిడి తెచ్చారని ఆయన ఆరోపించారు. న్యాయం చేయాలని అప్పట్లోనే ఎస్పీగా ఉన్న అన్బురాజన్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. రక్షణ కల్పించాలని పోలీసులను కోరినా ప్రయోజనం లేకపోవడంతో కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు.. కృష్ణారెడ్డి ఫిర్యాదుపై విచారణ చేపట్టి సునీత, రాజశేఖరరెడ్డి, రాంసింగ్‌పై కేసు నమోదుచేయాలని ఆదేశించింది. ఈ మేరకు ఐపీసీ సెక్షన్ 156 (3) కింద పులివెందుల పోలీసులు శనివారం కేసు నమోదుచేశారు.



## తెలంగాణ ప్రభుత్వం సరికొత్త పథకం...?

తెలంగాణ ప్రభుత్వం మరో కీలక పథకం అమలుకు అడుగులు వేస్తోంది. ఎన్నికల హామీలో పేర్కొన్న విధంగా బాలికలకు ఎలక్ట్రిక్ స్కూటర్లను పంపిణీ చేసేందుకు సిద్ధమైంది. 18 ఏళ్లు నిండిన బాలికల చదువుకునే బాలికలకు ఈ పథకం వర్తిస్తుంది. అయితే, పథకం అమలు కోసం మార్గదర్శకాలను నిర్దేశిస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా 18 ఏళ్లు నిండిన బాలికల సంఖ్యపై అధికారులు గణాంకాలు సిద్ధం చేస్తున్నారు. కానీ దూరవిద్యలో చదువుతున్న బాలికలకు ఈ పథకం సరిపోదన్న ప్రచారం జరుగుతోంది. రెగ్యులర్ గా కాలేజీలకు వెళ్లే వారికి ఈ పథకాన్ని వర్తింపజేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వారు కూడా ఈ పథకానికి అర్హులని తెలిపారు. పూర్తిగా డ్రైవింగ్ చేసే వారికి ఎలక్ట్రిక్ స్కూటర్లు ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. కాగా, ఎలక్ట్రిక్ వాహనాలపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రాయితీలు ఇస్తోంది. ఈ పథకం అమలుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.




## నిద్రలేమితో కేన్సర్ ముప్పు

నిద్రలేమితో బాధపడేవారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతున్నది. ఈ రుగ్మత అంత ప్రమాదకారి కాదని భావిస్తూ వస్తున్నారు. కానీ సుదీర్ఘకాలంగా నిద్రలేమితో సతమతమైతే కేన్సర్ బారిన పడటం ఖాయమని, బుద్ధిమాంద్యం, పార్కిన్సన్స్ వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని తాజా అధ్యయనం హెచ్చరించింది. రాత్రంతా మేల్కొని పనిచేయటం వల్ల మెలటోనిన్ హార్మోన్ విడుదల కాదు. దీంతో శరీరం కేన్సర్ ముప్పున పడే అవకాశం ఎక్కువని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## హైదరాబాద్‌లో కారు బీభత్సం.. వ్యక్తి మృతి

హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌లో ఓ కారు బీభత్సం సృష్టించింది. మద్యం మత్తులో ఓ వ్యక్తి కారు నడుపుతూ.. పాదచారులపైకి కారును పోనిచ్చాడు. దీంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం కారు అదుపుతప్పి కమాన్ దిమ్మెను ఢీకొట్టడంతో కారులో ఉన్న ఏడుగురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. వారందరూ కూడా బర్త్‌డే పార్టీకి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది.



## స్లీపర్ బోగీలతో వందేభారత్..!

వందేభారత్ రైళ్లు త్వరలోనే స్లీపర్ తరగతి బోగీలతో అందుబాటులోకి రానున్నాయి. విజయవాడ డివిజన్లో నడుస్తున్న సికింద్రాబాద్-విశాఖపట్నం, విజయవాడ-చెన్నై సెంట్రల్ రైళ్లకు ఎక్కువ గిరాకీ ఉండగా స్లీపర్ తరగతి బోగీలతో నడిచే వందేభారత్ కు మరింత ఆదరణ పెరిగే అవకాశాలున్నాయని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రెండు వందేభారత్ స్లీపర్ రైళ్లు విజయవాడ డివిజన్ కు కేటాయించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# చెలరేగిన అర్ష్‌దీప్, అవేశ్..

## తొలి వన్డేలో ఇండియా గ్రాండ్ విక్టరీ

### 8 వికెట్ల తేడాతో చిత్తయిన సౌతాఫ్రికా




వన్డే వరల్డ్ కప్ ఓటమి తర్వాత ఆడుతున్న తొలి సిరీస్. ఆ ఫైనల్లో ఆడిన వారిలో ముగ్గురే తుది జట్టుతో ఉన్నారు. పేస్‌కు స్వర్గధామం అయిన సౌతాఫ్రికాలో సీనియర్లు జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ షమీ, మహ్మద్ సిరాజ్ లేకుండానే బరిలోకి దిగారు. ఇలాంటి పరిస్థితుల్లో సఫారీ గడ్డపై ఇండియన్స్ తొలి మ్యాచ్‌లో అద్భుతం చేశారు. యంగ్ పేసర్లు అర్ష్‌దీప్ సింగ్ (5/37), అవేశ్‌ఖాన్ (4/27) బుల్లెట్లలాంటి బంతులతో బ్యాటర్లను వణికించారు. బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు పింక్ కలర్ జెర్సీలతో ఉత్సాహంగా బరిలోకి దిగిన సఫారీల మైండ్‌బ్లాక్ చేశారు. దాంతో ఆదివారం జరిగిన తొలి వన్డేలో 8 వికెట్ల తేడాతో సౌతాఫ్రికాను చిత్తు చేసిన ఇండియా మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యం సాధించింది. ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు వచ్చిన సఫారీ టీమ్ అర్ష్‌దీప్, అవేశ్ దెబ్బకు 27.3 ఓవర్లలో 116 రన్స్‌కే కుప్పకూలింది. ఫెలుక్వాయో (33), టోనీ డి జార్జీ (28), మార్క్రమ్ (12), షంసీ (11 నాటౌట్) తప్ప మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్‌కే ఔటయ్యారు. తర్వాత అరంగేట్రం కుర్రాడు సాయి సుదర్శన్ (43 బాల్స్‌లో 9 ఫోర్లతో 55 నాటౌట్), శ్రేయస్ అయ్యర్ (45 బాల్స్‌లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 52) ఫిఫ్టీలతో రాణించడంతో ఇండియా 16.4 ఓవర్లలోనే 117/2 స్కోరు చేసి ఈజీగా గెలిచింది. అర్ష్‌దీప్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. మంగళవారం గెబెహాలో రెండో వన్డే జరుగుతుంది.

**సూపర్ బౌలింగ్**

సీనియర్లు లేని సమయంలో అర్ష్‌దీప్, అవేశ్ మ్యాజిక్ చేశారు. తొలుత లెఫ్టార్మ్ బౌలర్ అర్ష్‌దీప్ మ్యాజికల్ స్పెల్ వేయగా.. మూడో పేసర్‌గా వచ్చిన అవేశ్ సైతం అదరగొట్టాడు. వీళ్లను ఎదుర్కోలేక సౌతాఫ్రికా క్వాలిటీ బ్యాటింగ్ లైనప్ బోల్తా కొట్టింది. ముఖ్యంగా షార్ట్ ఫార్మాట్‌లో నిలకడ లోపించిన అర్ష్‌దీప్ కెరీర్ బెస్ట్ బౌలింగ్‌తో జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకునే పెర్ఫామెన్స్ చేశాడు. పవర్ ప్లేలోనే నాలుగు వికెట్లతో ఆతిథ్య జట్టు నడ్డి విరిచాడు. పిచ్‌పై లభిస్తున్న అనూహ్యమైన బౌన్స్‌ను సద్వినియోగం చేసుకుంటూ సీమ్, స్వింగ్‌తో టాపార్డర్ బ్యాటర్లను తీవ్రంగా ఇబ్బంది పెట్టాడు. ఫాస్ట్, ఫుల్ లెంగ్త్ బాల్స్ వేస్తూ బ్యాటర్లు క్రీజు కదలకుండా కట్టడి చేశాడు. రెండో ఓవర్లో బౌలింగ్‌కు వచ్చిన అతను నాలుగో బాల్‌కు ఓపెనర్ రీజా హెండ్రిక్స్ (0)ను బౌల్డ్, ఐదో బాల్‌కు వాండర్ డసెన్ (0)ను ఎల్బీ చేసి హ్యాట్రిక్‌పై నిలిచాడు. ఈ దశలో కెప్టెన్ మార్క్రమ్‌తో జతకట్టిన మరో ఓపెనర్ టోనీ.. ముకేశ్ వేసిన ఐదో ఓవర్లో 4,6తో ఎదురుదాడికి దిగాడు. అర్ష్‌దీప్ బౌలింగ్‌లోనూ సిక్స్ కొట్టాడు. కానీ, అదే ఓవర్లో షార్ట్ లెంగ్త్ బాల్‌తో అతడిని అర్ష్‌దీప్ వెనక్కు పంపాడు. తన తర్వాతి ఓవర్లోనే మరో అద్భుత డెలివరీతో క్లాసెన్ (6)ను బౌల్డ్ చేయడంతో పవర్‌ప్లేలోనే సఫారీ టీమ్ 52/4తో కష్టాల్లో పడింది. ఆ తర్వాత అవేశ్ షో మొదలైంది. 11వ ఓవర్లో వరుస బాల్స్‌లో మార్క్రమ్, వియాన్ ముల్డర్ (0)ను ఔట్ చేసి ప్రత్యర్థికి డబుల్ షాకిచ్చాడు. అవేశ్ బాల్‌ను మార్క్రమ్ వికెట్ల మీదకు ఆడుకోగా.. లెగ్ కట్టర్‌కు ముల్డర్ వికెట్ల ముందు దొరికిపోయాడు. ఆపై అవేశ్ లెంగ్త్, బౌన్స్‌ను అర్థం చేసుకోలేక డేవిడ్ మిల్లర్ (2) కీపర్‌కు క్యాచ్ ఇవ్వగా.. షార్ట్ లెంగ్త్ బాల్‌ను కేశవ్ మహారాజ్ (4) నేరుగా రుతురాజ్ చేతుల్లోకి కొట్టాడు. దాంతో చెరో నాలుగు వికెట్లు ఖాతాలో వేసుకున్న అర్ష్‌దీప్, అవేశ్ ఐదో వికెట్ కోసం పోటీ పడ్డారు. 73/8తో నిలిచిన సఫారీ టీమ్ వందలోపే ఆలౌటయ్యేలా కనిపించింది. అయితే, టెయిలెండర్ ఫెలుక్వాయో కొద్దిసేపు ప్రతిఘటించాడు. బర్గర్ (7) సపోర్ట్‌తో స్కోరు వంద దాటించాడు. చివరకు ఓ ఫుల్ లెంగ్త్ బాల్‌తో ఫెలుక్వాయోను ఎల్బీ చేసిన అర్ష్‌దీప్ ఐదు వికెట్ల స్పెల్ ఖాతాలో వేసుకున్నాడు. కుల్దీప్ బౌలింగ్‌లో బర్గర్ బౌల్డ్ అవ్వడంతో సౌతాఫ్రికా ఇన్నింగ్స్ ముగిసింది.

**100 బాల్స్‌లోనే**

కొత్త కుర్రాడు సాయి సుదర్శన్, సీనియర్ ప్లేయర్ శ్రేయస్ అయ్యర్ మెరుపులతో చిన్న టార్గెట్‌ను ఇండియా అలవోకగా ఛేజ్ చేసింది. తొలి ఇంటర్నేషనల్ మ్యాచ్‌లోనే సుదర్శన్ తన టాలెంట్ చూపెట్టాడు. ఎదుర్కొన్న తొలి బాల్‌కే ఫోర్ కొట్టిన అతను మంచి డ్రైవ్స్‌తో పాటు బ్యాక్‌ఫుట్‌పై షార్ట్ బాల్స్‌ను ఈజీగా పుల్ చేశాడు. స్పిన్నర్లనూ పక్కాగా ఎదుర్కొన్నాడు. షంసీ బౌలింగ్‌లో కొట్టిన ఆన్ డ్రైవ్ ఫోర్ అందరినీ ఆకట్టుకుంది.

ఓపెనర్ రుతురాజ్ (5) ఫెయిలైనా వన్‌డౌన్‌లో వచ్చిన శ్రేయస్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లాడు. మరోవైపు అయ్యర్ సైతం తన క్లాస్ చూపెట్టాడు. ఈ ఇద్దరూ క్రమం తప్పకుండా బౌండ్రీలు రాబట్టారు. ఈ క్రమంలో ఫెలుక్వాయో వేసిన 16వ ఓవర్లో సింగిల్‌తో సాయి ఫిఫ్టీ పూర్తి చేసుకోగా.. అదే ఓవర్లో వరుసగా 4, 6 కొట్టిన అయ్యర్ కూడా ఫిఫ్టీ దాటాడు. తర్వాతి బాల్‌కు తను ఔటైనా తిలక్ (1 నాటౌట్)తో కలిసి సాయి లాంఛనం పూర్తి చేశాడు. టార్గెట్‌ను ఇండియా కేవలం వంద బాల్స్‌లోనే ఛేజ్ చేయడం విశేషం.

# మళ్ళీ పెళ్ళి పై కామెంట్స్ చేసిన సమంత

స్టార్ హీరోయిన్ సమంత కు యూత్ లో చాలా ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. చాలా విషయాల్లో సమంత ను సపోర్ట్ చేస్తూ వచ్చారు ఫ్యాన్స్. ప్రస్తుతం తన స్వంత నిర్మాణ సంస్థ ట్రలాలా మూవింగ్ పిక్చర్స్‌ను ప్రారంభించడంలో బిజీగా ఉంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఇటీవలి ప్రశ్నోత్తరాల సెషన్ నిర్వహించగా, ఒక ఫాలోవర్ ఒక ఆసక్తికరమైన ప్రశ్న వేశారు. మళ్ళీ పెళ్ళి గురించి అంటూ చెప్పుకొచ్చారు. అయితే సమంత మళ్ళీ పెళ్ళి కాన్సెప్ట్ పై తనదైన శైలి లో రెస్పాండ్ అయ్యింది. మొదటి సారి పెళ్లి చేసుకున్న వారు విడిపోవడానికి 50 శాతం అవకాశం ఉంది అని, అదే రెండో సారి, మూడోసారి పెళ్లిల్లకు ఎక్కువ అంత కుమించి ఎక్కువ శాతం విడాకులు అయ్యే అవకాశాలు ఉన్నాయి అని విడాకుల రేటు గణాంకాలను కూడా షేర్ చేయడం జరిగింది. ఈ పోస్ట్ ఇప్పుడు వైరల్ గా మారుతోంది. వర్క్ ఫ్రంట్‌లో, సిటాడెల్ ఆమె పైప్‌లైన్‌లో ఉంది, ఇది వచ్చే ఏడాది విడుదల కానుంది.



## త్వరలో మంత్రివర్గ విస్తరణ!..

# రేపు ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి



త్వరలో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. మలి విస్తరణలో తమకు అవకాశం వస్తుందని పలువురు నేతలు ఎదురుచూస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 19న దిల్లీ వెళ్లి పార్టీ అగ్ర నేతలతో సమావేశం కానున్నారు. మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పదవుల భర్తీపైన హైకమాండ్‌తో చర్చించనున్నారని సమాచారం. త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరగనుండడంతో ముందుగా పదవుల పంపిణీ ద్వారా పార్టీలో జోష్ తేవాలని భావిస్తున్నారు. లోక్‌సభ అభ్యర్థుల విషయంలోనూ ఇప్పటికే ఒక జాబితా సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. మంత్రివర్గ విస్తరణలో గ్రేటర్ హైదరాబాద్‌కే తొలి ప్రాధాన్యం ఇస్తారని సమాచారం. హైదరాబాద్ నగరంలోని నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ అభ్యర్థులు ఎవరూ ఎన్నికల్లో గెలవలేదు. అయినప్పటికీ నాంపల్లిలో పరాజయం పొందిన ఫిరోజ్‌ఖాన్ మైనార్టీ కోటాలో పోటీలో ఉన్నారు. నిజామాబాద్ అర్బన్ స్థానంలో ఓటమి చెందిన షబ్బీర్‌అలీకి మంత్రి పదవి ఓకే అయితే ఫిరోజ్‌ఖాన్‌కు అవకాశాలు ఉండవని సమాచారం. మల్కాజిగిరి నుంచి ఓడిపోయిన మైనంపల్లి హన్మంతరావు మంత్రి పదవి ఆశిస్తున్నారు. అయితే ఆయనను మల్కాజిగిరి లోక్‌సభ స్థానం నుంచి బరిలోకి దింపాలనే ఆలోచన ఉన్నట్లు పార్టీలో ప్రచారం సాగుతోంది. అంజన్‌కుమార్ యాదవ్(ముషీరాబాద్), మధుయాస్కీ(ఎల్బీనగర్)లు కూడా ఎన్నికల్లో ఓడిపోయినా వారి పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. షబ్బీర్‌అలీ, అంజన్‌కుమార్‌లకు మంత్రులుగా అవకాశం ఇచ్చి ఎమ్మెల్సీలుగా ఎంపిక చేస్తారని వారి అనుచరులు చెబుతున్నారు. ఆదిలాబాద్ నుంచి గడ్డం వినోద్, వివేక్ సోదరుల మధ్యే మంత్రి పదవికి పోటీ ఉంది. ఇద్దరూ దిల్లీలో అగ్రనేతలను కలిసినట్లు తెలుస్తోంది. తనకు అవకాశం ఇస్తారని వివేక్ ధీమాతో ఉన్నారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు కూడా ప్రయత్నిస్తున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేరు పరిశీలనలో ఉంది. అదే సమయంలో కీలకమైన హోం శాఖ ఎవరికైనా అప్పగిస్తారా లేక సీఎం వద్దనే ఉంచుకుంటారా అనే చర్చ కూడా సాగుతోంది. ఇటీవల ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులకు ఏడాది పాటు ఏ పదవీ ఇవ్వకూడదని పార్టీ యోచిస్తున్నట్టు కూడా మరోపక్క ప్రచారం జరుగుతోంది. దాన్నే అమలు చేస్తే మాత్రం ఓటమి చెందిన వారికి మంత్రిపదవులు దక్కే అవకాశం లేదని పార్టీ నేతలు చెబుతున్నారు.